క్లుప్తంగా

మానవాళి మనుగడకు మొక్కలే ఆధారం



విమానాశ్రయం ఆవరణలో మొక్క నాటుతున్న డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు

మధురపూడి: మానవాళి మనుగడకు మొక్కలే ఆధారమని విమానాశ్రయం డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం విమానాశ్రయంలో శనివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీన ప్రారంభించారు. దీనిలో భాగంగా విమానాశ్రయం ఆవరణలో దాదాపు వెయ్యి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విమానాశ్రయం డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ విమాన సర్వీసుల సంఖ్య పెంపుకు పౌరవిమానయానశాఖ ప్రయత్నాలు చేస్తున్నట్టు వెల్లడించారు.

లైసెన్సులు రెన్యువల్ చేయించుకోవాలి



కార్మిక శాఖ సహాయాధికారి కేశవరావు

పెదపూడి: వ్యాపార సంస్థలు తమ లైసెన్సులను రెన్యువల్ చేయించుకోవాలని సహాయ కార్మిక అధికారి జి.కేశవరావు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ అనపర్తి, బిక్కవోలు, రాయవరం మండలాలకు సంబంధించి వ్యాపార సంస్థలన్నీ లైసెన్సుల రెన్యువల్, కొత్త షాపులైతే రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే భారీ జరిమానా విధిస్తామన్నారు. భవన నిర్మాణ కార్మికులు రాయవరం లేబర్ ఆఫీసులో రెన్యువల్, రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు. ఎవరైనా భవనాలు నిర్మిస్తుంటే లేబర్ సెస్ ఒక శాతం చెల్లించాలని పేర్కొన్నారు.

సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రమణమూర్తి మృతి



రమణమూర్తి (ఫైల్)

పెదపూడి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్, దంత వైద్య నిపుణుడు రమణమూర్తి(53) శనివారం కాకినాడలోని ఆయన ఇంటిలో గుండెపోటుతో మృతి చెందారు. శనివారం ఉదయం గుండెపోటుకు గురైన ఆయనను సమీపంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మృతికి పుట్టా గంగాధర్ చౌదరి, ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, కాకర సాయి బాబు, కోరా బాబి, సమ్మంగి దుర్గా ప్రసాద్, మార్ని కామరాజు చౌదరి తదితరులు సంతాపం ప్రకటించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రాజానగరం: లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులు, స్థానిక ఎన్‌డీఏ నాయకులతో చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హామీ ఇచ్చారు. కాలనీకి చెందిన పలువురు ఎన్‌డీఏ నాయకులు శనివారం ఆయనను కలుసుకున్నారు. కాలనీలో అపరిష్కృతంగా ఉన్న వివిధ సమస్యలను ప్రస్తావించారు.

కట్నం వేధింపులు

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీకి చెందిన మిరియాల పూర్ణ విజయదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కట్నం వేధింపుల కేసు నమోదు చేశారు. ఎస్సై రామ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండపేట మండలం ద్వారపూడికి చెందిన ఏపుగంటి సాయితో విజయదుర్గకు 2022 లో వివాహమైంది. అయితే భర్త సాయితో పాటుగా అత్తమామలైన సత్యవతి, వీరన్న, ఆడపడుచు దుర్గ కట్నం కోసం విజయదుర్గ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో వ్యక్తి గల్లంతు

మధురపూడి: కోరుకొండ మండలం కోటికేశవరం గ్రామానికి చెందిన కె.అమ్మిరాజు శనివారం గ్రామంలోని చిన్నా పెద్ద చెరువులో గల్లంతయ్యాడు. అతడు మద్యం మత్తులో చెరువులోకి దిగినట్టు స్థానికులు చెబుతున్నారు. గల్లంతైన అమ్మిరాజు కోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు ఎస్సై శ్యామసుందర్ తెలిపారు.

రౌడీ షీటర్‌కు రిమాండ్

సీతానగరం: లైన్‌మన్‌పై దాడి చేసిన రౌడీషీటర్‌కు కోర్టు రిమాండ్ విధించిందని ఎస్సై రామ్ కుమార్ శనివారం తెలిపారు. బొబ్బిల్లంకకు చెందిన లైన్‌మన్ చింతపల్లి రామకృష్ణ విధులు నిర్వర్తిస్తుండగా అతడిపై రౌడీ షీటర్ సోడదాసి సీతారామరాజు దాడి చేశాడు. లైన్‌మన్ ఫిర్యాదు మేరకు సీతారామరాజుపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

ముంపు ముప్పు తప్పేదెప్పుడు!

- విమానాశ్రయం వృథా నీటిలో మునిగిపోతున్న పొలాలు
- ఆవేదనలో రైతులు
- పొలాలకు దారులు లేక అవస్థలు

మధురపూడి: విమానాశ్రయం అభివృద్ధికి కోసం భూములు ఇచ్చిన రైతులు ఇప్పుడు ముంపు సమస్యతో బాధపడుతున్నారు.ఎయిర్ పోర్టు అభివృద్ధి జరిగితే తమ ప్రాంతం ప్రగతి పథంలో పయనిస్తుందనే ఉద్దేశంతో ఆ సమయంలో భూములు ఇచ్చారు. అనుకున్న విధంగానే మధురపూడి విమానాశ్రయం ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అభివృద్ధి పథంతో దూసుకుపోతోంది. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ విమానాశ్రయం చుట్టు పక్కల రైతుల పొలాలను ముంపు సమస్య వేధిస్తోంది.

వివరాలు ఇవీ..

కోరుకొండ మండలం మధురపూడి, బూరుగుపూడి, గుమ్ములూరు గ్రామాలకు చెందిన రైతులు వందల ఎకరాలు భూములను విమానాశ్రయం కోసం ఇచ్చారు. ప్రైవేటుగా అధిక ధరలు పలుకుతున్నప్పటికీ ప్రభుత్వం ప్రకటించిన ధరలకే విక్రయించారు. అయితే విమానాశ్రయం నుంచి వృథానీరు, వర్షం నీటి కారణంగా మధురపూడిలో వంద ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి.

విమానాశ్రయం అభివృద్ధి

2015–16 సంవత్సరానికి ముందు, తర్వాత కూడా రైతులు ఎయిర్‌పోర్టు విస్తరణ నిమిత్తం రైతులు భూములిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా భారత పౌర విమానయాన శాఖ విమానాశ్రయం విస్తరణ కోసం భూములను సేకరించింది. దానిలో భాగంగా మధురపూడి, బూరుగుపూడి, గుమ్ములూరు గ్రామాలకు చెందిన రైతులు భూములు అందజేశారు. దీంతో విమానాశ్రయంలో 3,165 మీటర్ల రన్‌వే నిర్మితమై, రోజూ 20 విమాన సర్వీసుల రాకపోకలకు అనుకూలంగా మారింది. అలాగే మరింత విస్తరణలో భాగంగా 2,100 మంది ప్రయాణికులు వేచి ఉండటానికి అనువైన కొత్త టెర్మినల్ భవనం నిర్మాణ దశలో ఉంది. దీనికి అనుగుణంగా మూడు



మధురపూడిలోని విమానాశ్రయం టెర్మినల్ భవనం

ఎయిరోబ్రిడ్జిలు నిర్మాణం జరగనున్నాయి. ఈ సౌకర్యంతో ఒకేసారి నాలుగు బోయింగ్ విమానాలు రాకపోకలకు అనుకూలంగా మారనుంది.

వృథానీటితో అవస్థలు

విమానాశ్రయంలో కురిసిన వర్షాలకు సంబంధించిన వృథానీరు బయటకు విడుదలై మధురపూడిలోని పొలాలు జలమయం అవుతున్నాయి. ముంపు కారణంగా పంట నష్టం జరుగుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సమస్య అపరిష్కృతంగా ఉంది.

దారి లేక..

విమానాశ్రయం విస్తరణకు భూములిచ్చిన రైతులు మిగిలిన తమ సొంత భూములు, తోటల్లోకి వెళ్లడానికి దారి లేక ఇబ్బంది పడుతున్నారు. సుమారు 2 నుంచి 3 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధానంగా మధురపూడిలో తిరుమలనాథుని సురేష్ తోట నుంచి నారయ్య కాపు తోట వరకూ రెండు కిలోమీటర్లు దారి ఏర్పాటు చేయాలి. బూరుగుపూడి రైతులు తోటల్లోకి వెళ్లడానికి స్థానికులతో సమస్యగా ఉంది. కనుక నీలపు నారాయణ తోట నుంచి ఈదల సత్యనారాయణ తోట వరకూ దారి నిర్మించాలి.

నీటిని మళ్లిస్తే ఎంతో ఉపయోగం

విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న నీటిని గ్రామంలోని పుష్కర కాలువకు మళ్లించాలి. దాని నుంచి నీరు స్థానిక జువ్వల చెరువుకు నీరు ప్రవహిస్తోంది. తద్వారా చెరువులో నీరు నిల్వ ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. పంట పొలాలను ముంచెత్తకుండా నీటిని పుష్కర కాలువకు మళ్లించాలని కోరుతున్నారు.



విమానాశ్రయంలో నీటి కారణంగా మునిగిన పొలాలు

కమ్యూనికేషన్ సదుపాయం

మధురపూడిలో కమ్యూనికేషన్ సదుపాయం లేదు. దీంతో ఫోన్ వినియోగానికి స్థానికులు దూరంగా ఉంటున్నారు. ఇక్కడ విమానాల రాకపోకల సందర్భంలో ఫోన్లు పనిచేయవు. విమానాశ్రయం సిగ్నల్ కారణంగా మొబైల్ ఫోన్లు వినియోగానికి స్థానికులు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేసి, సెల్‌ఫోన్ల వినియోగానికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

పూర్తి సహకారం



విమానాశ్రయం నుంచి విడుదలవుతున్న వర్షం నీరు మళ్లింపులో భాగంగా ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమానికి సహకరిస్తాం.అన్నదాతలకు నష్టం జరగకుండా జరిగే కార్యక్రమాలకు పూర్తిగా సహకరిస్తాం. అయితే రెండో పంటసాగుకు ఎయిర్‌పోర్టు నుంచి విడుదలవుతున్న నీరు ఉపయోగపడవచ్చు. ఈ నీటిని మధురపూడి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని తొర్రిగెడ్డ కాలువలో మళ్లించేలా చర్యలు చేపడతామని కలెక్టర్ ప్రశాంతి హామీ ఇచ్చారు.

– జ్ఞానేశ్వరరావు, విమానాశ్రయం డైరెక్టర్

దారులు ఏర్పాటు చేయాలి



విమానాశ్రయం నుంచి వచ్చే నీటితో పంటలకు కలుగుతున్న ముంపు సమస్యను పరిష్కరించాలి. అలాగే భూములు, తోటల్లోకి వెళ్లడానికి అనువుగా దారులు నిర్మించాలి. చాలా ఏళ్లగా ఈ సమస్య పరిష్కారం కాకుండా ఉంది. దీని శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించడానికి అధికార యంత్రాంగం కృషి చేయాలి.

– గణేశుల పోసి, రైతు నాయకుడు, మధురపూడి

ఎలుకల నిర్మూలనకు సామూహిక చర్యలు

రాజానగరం: వరి పంటను ఎలుకల బారి నుంచి కాపాడుకోవాలంటే రైతులందరూ సామూహికంగా నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం (దివాన్ చెరువు) కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వరి పొలాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. నరసింహారావు మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ వరిసాగు చాలా వరకూ ఈనిక దశలో ఉందని, ఈ తరుణంలో ఎలుకల బెడద లేకుండా చూసుకోవాలన్నారు. బ్రోమాడియోలిన్ మందును ఎలుకలు నివసించే బొరియల వద్ద పొట్లాలుగా కట్టి ఉంచాలన్నారు.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు

ప్రస్తుతం పలుచోట్ల వరి పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. కొన్ని ప్రాంతాలలో ఎండాకు తెగులు కనిపించిందన్నారు. ఇటువంటి పొలాలకు నత్రజని ఎరువు వేయడం ఆపివేయాలన్నారు. మ్యూరియేట్ ఆఫ్ పొటాష్‌ను ఎకరాకు 20 కిలోలు చల్లుకోవాలన్నారు. తెగులు ఉధృతి పెరగకుండా ప్లాంటోమైసిన్ ఒక గ్రాము, కాపర్ హైడ్రాక్సైడ్ రెండు గ్రాములను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే అక్కడక్కడా సుడిదోమ ఛాయలు కనిపించాయన్నారు. వీటి నుంచి పంటను కాపాడుకునేందుకు అసిఫేట్ 1.5 గ్రాములు, లేదా ట్రైఫ్లూమీజోపెరిమ్ 0.4 గ్రామును ఒక లీటర్ నీటిలో కలిపి చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎలుకల మందు తయారీ విధానాన్ని వివరిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైయున్న పద్మావతి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



చంద్రేడులో కొలువైయున్న వేంకటేశ్వరస్వామి



సంపరలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు

పెదపూడి: మండలంలోని సంపరలో ప్రసిద్ధి చెందిన కలియుగ వేంకటేశ్వరస్వామికి భాద్రపద మాసం శనివారం సందర్భంగా అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్లు అతికించలేం

సీతానగరం: టీడీపీ వంద రోజుల పాలనకు సంబంధించి 'ఇది మంచి ప్రభుత్వం' అనే స్టిక్కర్లును ఇళ్ల వద్ద తాము అతికించలేమని మండలంలోని సచివాలయ ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎంపీడీవో కె.రమేష్‌కు శనివారం వినతి పత్రం అందించారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయానికి మండలంలోని సచివాలయ ఉద్యోగులందరూ తరలివచ్చారు. అనంతరం మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బందిని గ్రామ పరిధిలో స్టిక్కర్లు అతికించడం, పోస్టర్లు పంపిణీ చేయడానికి ఉపయోగించడాన్ని పునరాలోచన చేయాలన్నారు. పెన్షన్లు పంపిణీని తెల్లవారుజామున కాకుండా కార్యాలయ పనివేళల్లో పంపిణీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.



ఎంపీడీవో రమేష్‌కు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

హోరాహోరీగా బాలికల క్రీడాపోటీలు



కబడ్డీలో తలపడుతున్న శ్రీరంగపట్నం, దోసకాయలపల్లి జట్లు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం హైస్కూల్లో శనివారం మండల స్థాయి బాలికల క్రీడా పోటీలు హోరాహోరీగా జరిగాయి. అండర్ 14, 17 విభాగాలకు సంబంధించి మండలంలోని 12 పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభను కనబర్చిన 50 మంది బాలికలు నియోజకవర్గ స్థాయికి ఎంపిక య్యారు. వీరు ఈ నెల 23వ తేదీ నుంచి రాజానగరంలో జరిగే పోటీలలో తలపడతారు. శ్రీరంగపట్నంలో కబడ్డీ, కోకో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ పోటీలు నిర్వహించారు. కబడ్డీలో శ్రీరంగపట్నం, వాలీబాల్‌లో కణుపూరు, కోకోలో కణుపూరు విజయం సాధించాయి. చెస్ పోటీల్లో శ్రీరంగపటాన్నికి చెందిన ముగ్గురు బాలికలు ప్రతిభ చూపారు. ఈ పోటీల ముగింపు సభలో హెచ్‌ఎం ఎస్.వెంకటేశ్వరరావు, ఎంఈఓ కుశలవ దొర, మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ సత్యనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా మహాకవి గురజాడ జయంతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తెలుగు శాఖ ఆధ్వర్యంలో శనివారం మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ మాట్లాడుతూ పండితుల భాష అయిన గాంధికాన్ని వదిలి, సామాన్య మానవుని తెలుగు వ్యావహారిక భాషను పట్టపుటేనుగు మీద ఊరేగించిన మహాకవి గురజాడ అని ప్రస్తుతించారు. తెలుగుశాఖాధిపతి డాక్టర్ ఎం.సుధామయి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర మాండలికంలో రచించబడిన కన్యాశుల్కం నాటకం ద్వారా మహాకవి ఆనాటి సామాజిక దురాచారాలైన వేశ్యావృత్తి, అవినీతి, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలను ఖండించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొంకుదురు ఉన్నత పాఠశాల వద్ద గురజాడకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తెలుగు భాషోద్ధరణకు గురజాడ కృషి

బిక్కవోలు: తెలుగు భాషోద్ధరణకు గురజాడ అప్పారావు చేసిన కృషి చిరస్మరణీయమని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. శనివారం గురజాడ 163వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని ఎలుగెత్తి చాటిన వ్యక్తి గురజాడ అన్నారు. విద్యార్థులు గురజాడ అప్పారావును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంవీవీఎస్ఎన్ చౌదరి, శ్రీకృష్ణ సాయి, పడాల ఈశ్వర్‌రెడ్డి, మహమ్మద్ వలీషా, లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర రాంబాబు సేవలు అభినందనీయం



గుబ్బల రాంబాబు దంపతులను సత్కరిస్తున్న ఎల్ఐసీ ఉద్యోగ సంఘం నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా సంస్థ ఉద్యోగిగానే కాకుండా జర్నలిస్టుగా, స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడిగా డాక్టర్ గుబ్బల రాంబాబు సమాజానికి అందించిన అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక మోడల్ కాలనీలోని భారతీయ జీవిత బీమా ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఉద్యోగ సంఘం తరపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీవిత బీమా సంస్థ రాజమహేంద్రవరం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి, విశ్రాంత సేల్స్ మేనేజర్ శేషయ్య, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వరరావు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు పి.సతీష్, జోనల్ సెక్రటరీ రవీంద్రనాథ్, ఐసియూ ప్రధాన కార్యదర్శి కోదండరామ్, నగర ప్రముఖులు తుమ్మిడి అరుణకుమార్, బామ్‌సెఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు నయనాల కృష్ణారావు మాట్లాడారు. రాంబాబు జీవిత బీమా సంస్థ ఉద్యోగిగా అంకితభావంతో 33 ఏళ్ల పాటు సేవలు అందించారన్నారు. స్వర్ణాంధ్ర సంస్థ ద్వారా మూడు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తున్నారన్నారు. ఆయనకు ఇంకా సర్వీసు ఉన్నప్పటికీ సేవా రంగానికి పూర్తిగా అంకితం కావాలన్న ఉద్దేశంతో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారన్నారు. ఈ సందర్భంగా గుబ్బల రాంబాబు మాట్లాడుతూ సమాజం కోసం పనిచేసిన వ్యక్తిని సమాజం గుర్తిస్తుందనేందుకు తన జీవితమే ఉదాహరణ అన్నారు. అనంతరం రాంబాబు, బేబి దంపతులను ఘనంగా సత్కరించారు.

26న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఆదిత్య డిగ్రీ కాలేజీలో ఈ నెల 26వ తేదీ ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని ఎస్ఈ కె.తిలక్ కుమార్, ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఈ మేరకు శనివారం కార్యక్రమం వివరాలు వెల్లడించారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ, కమిటీ సభ్యులు వి.జనార్దనరావు, ఎస్.హరిబాబు, సురేంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. అనంతరం 12 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ వేంకటేశ్వరా ఆనం కళాకేంద్రం ఎదురుగా కార్పొరేషన్ ప్రాంగణంలో ఉన్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం టౌన్–1లో విద్యుత్ సమస్యల ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. వినియోగదారులు వేదికలో తమ సమస్యలను లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కోరారు.

నేరాల కట్టడికి నిరంతర నిఘా



రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

రాజానగరం: శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా నేరాలను అరికట్టడానికి నిరంతరం నిఘాతో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు. రాజానగరం పోలీసు స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వివిధ రకాల రికార్డులను, స్టేషన్ పరిసరాలను నిశితంగా పరిశీలించారు. కొన్ని కేసుల గురించి ఆరా తీశారు. స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరిగతిన పరిష్కరించాలని, మద్యం, గంజాయి, సారా రవాణాలను పూర్తిగా నియంత్రించాలన్నారు. విధి నిర్వహణలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఎస్పీ వీరయ్య గౌడ్, ఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బిక్కవోలు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని సర్పంచ్ సబ్బారపు పద్మావతి అన్నారు. శనివారం పందలపాక పంచాయతీ వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి, సూపర్‌వైజర్ శాంతి రత్నకుమారి, పంచాయతీ వార్డు సభ్యులు యామల చిన్నామ్మ, సబ్బెళ్ల విజయభాస్కర్‌రెడ్డి, అనసూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం

బిక్కవోలు: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా బిక్కవోలు శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఈఓ భాస్కర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ప్రసాద్, సత్తిరెడ్డి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పోటీలు



పోటీలను పర్యవేక్షిస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ నాగమణి

రాజానగరం: బేటీ బచావో, బేటీ బడావో కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం విద్యార్థినులకు శనివారం చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు మండలంలోని పలు ఉన్నత పాఠశాలల విద్యార్థినులు హాజరయ్యారు. జిల్లా డీసీపీఓ సి.రాజ్‌కుమార్, సోషల్ వర్కర్లు వి.శిరీష, ఆర్.ప్రదీప్ పర్యవేక్షించారు. విజేతలకు 23న జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని సీడీపీఓ తెలిపారు.

ఉపాధి హామీ ప్రజావేదిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ వద్ద ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులపై శనివారం ప్రజావేదిక నిర్వహించి 17వ సామాజిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకూ జరిగిన 1,881 పనులపై ఆరా తీశారు. మండలంలో వేతనాలుగా రూ.8.27 కోట్లు చెల్లించగా, పంచాయతీరాజ్ శాఖ మెటీరియల్ నిమిత్తం రూ.3.46 కోట్లు వెచ్చించారని అధికారులు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అధికారులెవరూ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేయొద్దని సూచించారు. కాపవరంలో నిబంధనలకు వ్యతిరేకంగా గృహాలు నిర్మించారన్నారు. కార్యక్రమంలో ఏపీడీ బి.రామ్‌ప్రసాద్, అంబుడ్స్‌మెన్స్ బాషా, డీవీఓ నరేష్, ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, అగిస్టీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

మధురపూడి: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం కోరుకొండ మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొయ్యా శామ్యూల్ రూ.10 వేలు అందించారు. పశ్చిమగానుగూడెంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరికి అందించారు.

కుట్టుమెషీన్ల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ఆధ్వర్యంలో మహిళలకు నాలుగు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. జేఎన్ రోడ్డులోని ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాల్లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నాళం నరసింహారావు మాట్లాడుతూ అమెరికాలో ఉంటున్న రాయల్ రెడ్డి సౌజన్యంతో తన తండ్రి ద్వారంపూడి దత్తాత్రేయ, తల్లి సుబ్బాయమ్మ, తమ్ముడు రాఘవేంద్రల జ్ఞాపకార్థం అందజేసినట్టు తెలిపారు. అలాగే రోటరి రివర్ సిటీ ట్రెజరర్ నూలి శివమల్లికార్జున్ సౌజన్యంతో బీటెక్ విద్యార్థినికి రూ.25 వేలను విద్యా ప్రోత్సాహకంగా అందజేశారు.